క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీలకు పెరటి కోళ్ల పంపిణీ



కక్కులూర్‌లో లబ్ధిదారులకు పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న స్రవంతి

షాబాద్: ఎస్సీ, ఎస్టీలకు పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్నట్లు షాబాద్ పశువైద్యాధికారి డాక్టర్ స్రవంతి తెలిపారు. గురువారం షాబాద్ మండలంలోని కక్కులూర్, అంతారం, బోడంపహాడ్ గ్రామాలల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 102 యూనిట్లు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దారిద్ర రేఖకు దిగువ ఉన్న కుటుంబాలకు ఉచితంగా కోళ్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అనేక రాయితీలు కల్పించిందని తెలిపారు. అర్హులైన రైతులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులున్నారు.

ఎస్సీ ధ్రువీకరణ పత్రాలివ్వాలి

మాదాసి కురువ సంఘం నేత సత్తయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సత్తయ్య

షాద్‌నగర్: ప్రభుత్వం మాదాసి కురువలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలివ్వాలని మాదాసి కురువ సంఘం జిల్లా కన్వీనర్ ఎమ్మె సత్తయ్య డిమాండ్ చేశారు. ఎంతోకాలంగా పోరాటం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక, సామాజిక, రాజకీయరంగాల్లో మాదాసి కురువలు అభివృద్ధి సాధించలేదని తెలిపారు. ఎస్సీ ధ్రువీకరణ పత్రాలివ్వకపోవడంతో విద్యార్థులు, యువకులు విద్యా, ఉద్యోగాల పరంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు శంకరయ్య, విఠలయ్య, బాల్‌రాజ్, భీరయ్య, బాల్‌రాజ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణపై ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

షాద్‌నగర్: ప్లాస్టిక్‌ను నివారించాలని రవీంద్ర భారతి పాఠశాల విద్యార్థులు గురువారం షాద్‌నగర్ పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రిన్సిపాల్ సతీష్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు భూమిలో కలిసిపోవడం లేదని, దీంతో కాలుష్యం ఏర్పడుతుందని పేర్కొన్నారు. తద్వార ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా జ్యూట్ బ్యాగులను అందరూ వినియోగించాలని కోరారు. ఉపాధ్యాయులు సుల్తాన్, శ్రీకాంత్, అఖిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

మండల వ్యవసాయాధికారి రాగమ్మ

మొయినాబాద్: కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాగమ్మ తెలిపారు. జూన్ 18 కంటే ముందు పట్టాదారు పాసుపుస్తకం పొంది 18–59 సంవత్సరాల మధ్య వయసు ఉన్న రైతులు పట్టాదారు పాసు పుస్తకంతోపాటు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు దరఖాస్తు ఫారానికి జతచేసి ఆగస్టు 5వ తేదీ లోపు రైతువేదికల్లో ఏఈఓలకు దరఖాస్తులను అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లక్ష్యాన్ని చేరుకోవాలి

వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ

మొయినాబాద్ రూరల్: ప్రతిభతో విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని అందుకోవాలని కె.ఎల్.యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ సూచించారు. యూనివర్సిటీలో ఇంజనీరింగ్ విద్యార్థులు వివిధ కార్యక్రమాల్లో పాల్గొని పేగా సీఎస్‌ఏ సర్టిఫికెట్ సాధించడంతో అభినందించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ పేగా సెల్యూషన్ రూపకల్పనలో విద్యార్థులు పాల్గొని ప్రదర్శించడంతోనే సీఎస్‌ఏ సర్టిఫికెట్ సాధించారని కొనియాడారు. విద్యార్థులకు ప్రాజెక్టులు, ప్రాక్టికల్స్‌తో పాటు విద్యాబోధన ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు టాలెంట్ ప్రదర్శించి ఉపయోగించినప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, కన్వీనర్ డాక్టర్ శ్రావణ్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఆశావహుల' ఉచిత సేవలు

- పంచాయతీ ఎన్నికలపై నేతల దృష్టి
- గ్రామాల్లో సేవా కార్యక్రమాలు
- ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం
- పల్లెల్లో మొదలైన ఎన్నికల సందడి
- సర్పంచ్ పదవుల కోసం పాట్లు



ఉచిత ప్రయాణానికి ఆటోలను ప్రారంభిస్తున్న నాయకుడు (ఫైల్)

మొయినాబాద్: పల్లెల్లో ఎన్నికల సందడి మొదలైంది. ఆశావహులు ఆరు నెలల ముందు నుంచే ఓటర్లను ఆకట్టుకునే పనిలో పడ్డారు. ప్రజల అవసరాలు తీర్చేందుకు సేవా కార్యక్రమాలు మొదలుపెట్టారు. ఉచిత సేవలు అందిస్తూ ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నంలో బిజీగా ఉన్నారు. ప్రస్తుత గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం 2024 ఫిబ్రవరి ఒకటితో ముగియనుంది. పంచాయతీలకు సకాలంలో ఎన్నికలు నిర్వహిస్తే వచ్చే జనవరిలోనే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఆరు నెలల్లో ప్రస్తుత సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తి కానుండడంతో గ్రామాల్లో సర్పంచ్ పదవికోసం ఆశపడే నాయకులు ఇప్పటి నుంచే తాము ఎన్నికల బరిలోకి దిగబోతున్నట్లు సంకేతాలిస్తున్నారు. ప్రజలు అడగకున్నా.. వారి అవసరాలను గుర్తించి సేవా కార్యక్రమాలు మొదలుపెడుతున్నారు. నగర శివారు ప్రాంతమైన మొయినాబాద్ మండలంలో ఈ సారి పంచాయతీ ఎన్నికలు ఆసక్తికరంగా మారే అవకాశం కనిపిస్తోంది. ఎందుకంటే ఈ ప్రాంతంలో భూముల ధరలు పెరగడంతోపాటు ఫాంహౌస్‌లు, విల్లాల నిర్మాణం జరుగుతుండడంతో చాలా మంది నాయకులు సర్పంచ్ పదవిపై కన్నేశారు. అందుకోసం ఇప్పటి నుంచే పావులు కదుపుతూ యువత, మహిళలు, రైతులను తమవైపు తిప్పుకునే పనిలో పడ్డారు.

ఉచిత సేవలు...

మండలంలోని చిన్నమంగళారంకు చెందిన ఓ యువ నాయకుడు పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామంలో ఉచిత సేవా కార్యక్రమాలు మొదలుపెట్టాడు. లాక్‌డౌన్ తరువాత గ్రామాలకు ఆర్టీసీ సర్వీసులను కుదించింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సదరు యువకుడు చిన్నమంగళారం నుంచి హిమాయత్‌నగర్ చౌరస్తా వరకు ప్రయాణించేందుకు రెండు ఆటోలను నడుపుతున్నాడు. అది కూడా ఒక్క పైసా తీసుకోకుండా ప్రయాణికులను ఉచితంగా తీసుకెళ్తున్నారు. అదే నాయకుడు గ్రామంలో ఎవరైనా మరణిస్తే అంతిమయాత్ర కోసం ప్రత్యేక వాహనాన్ని కూడా ఏర్పాటు చేశారు. బాకారం గ్రామంలో కూడా ఓ యువ నాయకుడు అంతిమయాత్ర వాహనాన్ని సిద్ధం చేశాడు. ఇలా ప్రజల మన్ననలను పొందేందుకు ఆశావాహులు పోటీ పడుతున్నారు. అప్పారెడ్డిగూడలో ఓ యువ నాయకుడు రైతు నేస్తం పేరుతో భూములు దున్నడానికి ట్రాక్టర్‌ను అందుబాటులో ఉంచాడు. అవసరమైన రైతులు డీజిల్ పోసుకుని భూములు దున్నుకునే ఏర్పాటు చేశాడు. రెడ్డిపల్లిలో ఓ నాయకుడు గ్రామంలోని అమ్మాయిల పెళ్లికి పుస్తెమట్టలు ఇస్తున్నాడు. ఇలా గ్రామాల్లో ఆరు నెలల ముందు నుంచే సర్పంచ్ పదవిని ఆశిస్తున్న నాయకులు ఉచిత సేవా కార్యక్రమాల్లో మునిగితేలుతున్నారు.

గ్రామాల్లో ఎన్నికల సందడి

జనవరిలో పంచాయితీ ఎన్నికలు జరుగుతాయనే ఊహాగానాలతో గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. అన్ని గ్రామాల్లో ఆశావాహులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటి నుంచే ఓటర్లను తమవైపు తిప్పుకునే పనిలో పడ్డారు. కొన్ని గ్రామాల్లో సదరు నేతలు విందులతో యువకులను ఆకట్టుకుంటున్నారు. యువకులను, రైతులను విహారయాత్రలకు తీసుకెళ్తున్నారు. ప్రతి రోజు గ్రామాల్లో చిన్న చిన్న పార్టీలు ఏర్పాటు చేస్తుండడంతో ఆరు నెలల ముందే గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది.

రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలి



షాబాద్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్: వ్యవసాయానికి సరఫరా చేస్తున్న ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు రైతులకు క్షమాపణ చెప్పాలని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మంత్రి కేటీఆర్ ఆదేశాలతో షాబాద్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముంబాయి–బెంగళూరు లింక్ జాతీయ రహదారిపై రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రైతులను చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. ప్రజలు, రైతుల మేలు కోరే బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉంటేనే అందరూ సంతోషంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు వెంకట్ యాదవ్, ఆరిఫ్, పాండురగారావు, సుధాకర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం తీసుకువస్తాం



షాబాద్‌లో మాట్లాడుతున్న ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి

పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

షాబాద్: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి.. మళ్లీ ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకువచ్చేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన వెంటనే రైతులకు రూ. 2 లక్షల రుణామాఫీ, రూ. 5 వందలకే గ్యాస్, దళిత, గిరిజనులకు 3 ఎకరాల భూమి ఇస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయని, వాటి పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పనిచేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆధరించాలని కోరారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన వారికి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాంరెడ్డి, మహిళా అధ్యక్షురాలు అశ్విని, సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు రవీందర్, ఆంజనేయులు, రవీందర్‌నాయక్, శేఖర్, బుచ్చయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

కేశంపేట: తమ డిమాండ్ల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, మల్లయ్య, చంద్రయ్య, బిక్షమయ్య, పద్మమ్మ, రాములమ్మ, నర్సమ్మ పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ చేయిస్తున్నారు..

షాద్‌నగర్: గ్రామ పంచాయితీ కార్మికులతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్ విమర్శించారు. గురువారం షాద్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయితీ కార్మికులు చేపట్టిన నిరాహార దీక్షకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పంచాయితీ కార్మికులు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం శ్రీను నాయక్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో పంచాయితీ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కార్మికులకు నెలకు రూ.26 వేలు వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించపోతే తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సురేశ్, యాదయ్య, జంగమ్మ, కిష్టమ్మ, చంద్రమ్మ, కమలమ్మ, భాగ్యమ్మ, రాజు, పెద్ద జంగయ్య, నర్సింలు, జంగమ్మ, మోహన్, రవి, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఇంటర్ అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోండి

కొందుర్గు: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్ కోసం ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కొందుర్గు సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ థామస్‌రెడ్డి కోరారు. కొందుర్గులో బైపీసీలో సీట్లు ఖాళీగా ఉన్నాయని.. అవసరమైన విద్యార్థులు ఈ నెల 15వ తేదిన నాదర్‌గుల్‌లోని నోబుల్ ఇంజనీరింగ్ కళాశాలలో గల టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్/కళాశాలలో సంప్రదించి దరఖాస్తులు అందజేయాలని సూచించారు. 2022–23 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని తెలిపారు.

గూడ్స్ రైలు బోగిలో పొగలు

శంకర్‌పల్లి/చేవెళ్ల: బొగ్గులోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలు బోగిలో పొగలు వస్తున్నట్లు గుర్తించిన అధికారులు మంటలను ఆర్పివేశారు. గురువారం సాయంత్రం సనత్‌నగర్ రైల్వే స్టేషన్ నుంచి బొగ్గులోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలు బోగిలో పొగలు వస్తున్నట్లు సిబ్బంది గుర్తించారు. వెంటనే అధికారులకు సమాచారం అందించారు. శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌లో అగ్నిమాపక సిబ్బంది పొగలను ఆర్పివేశారు.

సాంకేతికతతో ఫోన్ గుర్తింపు

కొత్తూరు: పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో ఓ వ్యక్తి పొగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు గుర్తించారు. కొత్తూరు పట్టణానికి చెందిన కార్తీక్ పెంజర్లలోని పీఅండ్ జీ పరిశ్రమలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం కొత్తూరుకు వస్తుండగా మార్గమధ్యలో బాధితుడి సెల్‌ఫోన్ పడిపోయింది. వెంటనే అతను కొత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ అనే అప్లికేషన్ ద్వారా ప్రస్తుతం ఫోన్‌ను వినియోగిస్తున్న వ్యక్తి వివరాలు తెలుసుకున్న పోలీసులు ఫోన్ ను స్వాధీనం చేసుకుని బాధితుడికి అందజేశారు.



బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్‌ఐ శంకర్

గ్రామాభివృద్ధిలో భాగస్వాములవ్వండి

సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్



వీధి దీపాలను ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్

షాబాద్: గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని పెద్దవేడ గ్రామ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని పెద్దవేడు గ్రామంలో ఎల్‌ఈడీ వీధి దీపాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తామన్నారు. అన్ని కాలనీలకు సీసీ రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్దిదారులకు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, వార్డు సభ్యులు నారాయణ, సురేష్, కృష్ణగౌడ్, అశోక్, గ్రామస్తులు రఘుపతి రెడ్డి, మహేందర్, రవికుమార్, శ్రీధర్‌గౌడ్, తదితరులున్నారు.

కాంగ్రెస్‌తోనే మహిళలకు అండ

పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్



పాపిరెడ్డిగూడ గ్రామంలో వీర్లపల్లి శంకర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు


కేశంపేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు అండగా నిలుస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గ్యాస్ సిలిండర్‌ను రూ. 500లకే అందిస్తామని తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలో మహిళలకు ఇచ్చిన విధంగా మన రాష్ట్రంలో కూడా మహిళ డిక్లరేషన్‌ను పాలమూరు రణభేరి సభలో ప్రియాంకగాంధీ ప్రకటిస్తారని తెలిపారు. పాలమూరు రణభేరి సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆలయంలో పూజలు

మండలంలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో గ్రామ ఉత్సవాలను నిర్వహించారు. అందులో భాగంగా గ్రామంలో మైసమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ ఆయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ యాదయ్య యాదవ్, శ్రీధర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, విజయరెడ్డి, పెంటయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నార్కోటిక్స్ బ్యూరో డీసీపీ చక్రవర్తి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడున్న డీసీపీ చక్రవర్తి

నందిగామ: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నార్కోటిక్స్ బ్యూరో డీసీపీ చక్రవర్తి సూచించారు. మొదళ్లగూడలోని సింబాయసిస్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రాన్ని అభ్యసిస్తున్న మొదటి సంవత్సరం విద్యార్థులకు గురువారం పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వినియోగం, వాటి పర్యవసనాలు అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ మాట్లాడుతూ డ్రగ్స్‌ను ప్యాషన్‌గా అలవాటు చేసుకొని, దానికి బానిసలుగా మారుతున్నారని తెలిపారు. డ్రగ్స్ విషయంలో కఠిన చట్టాలున్నాయని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సంతోష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దళితులను దగా చేసిన ప్రభుత్వం

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్



కొందుర్గులో మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్

కొందుర్గు: దళితులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం దగా చేసిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. గురువారం కొందుర్గు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులను ముఖ్యమంత్రి చేస్తామని ప్రకటించి.. వారిని దగా చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయాంలో పేదలకు ఇచ్చిన అసైన్డ్, సీలింగ్ భూములను లాక్కొని ప్రయివేట్ కంపనీలకు అప్పగిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ రూపొందించి దళితులకు ప్రత్యేక నిధులు ఇస్తే... ప్రస్తుతం దళితబంధు పేరుతో బీఆర్‌ఎస్ కార్యకర్తలకు మాత్రమే రూ. 10 లక్షలు ఇస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు కృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ నరేందర్, నాయకులు పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, బాబర్ ఖాన్, రఘునాయక్, గోవర్ధన్ గౌడ్, రమేష్, రవి, ఇసాక్ పాల్గొన్నారు.

83 మంది ఎస్‌ఐలు బదిలీ

కొందుర్గు: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 83 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ గురువారం సైబరాబాద్ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న విజయ్‌ను సీసీఎస్ కూకట్‌పల్లి పీఎస్‌కు, కొత్తూర్‌లో పనిచేస్తున్న శంకర్‌ను సీసీఎస్ మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు, షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్‌ఐగా పనిచేస్తున్న లక్ష్మణ్ నాయక్‌ను జీడీమెట్ల పీఎస్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా అల్వాల్ ట్రాఫిక్ ఎస్‌ఐగా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను కొత్తూర్ పీఎస్‌కు, గచ్చిబౌలి ట్రాఫిక్ సెక్టార్‌లో విధులు నిర్వహిస్తున్న బీఎస్‌ఎస్ వరప్రసాద్‌ను కేశంపేట పీఎస్‌కు బదిలీ చేశారు. అలాగే నార్సింగ్ పీఎస్‌లో పనిచేస్తున్న జె.కృష్ణయ్యను కొందుర్గు పీఎస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చేవెళ్లలో..

చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్‌ఐలు అబ్దుల్ హయ్యూమ్, పి. మహేందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. వీరి స్థానంలో చేవెళ్లకు ఆర్. వీరబ్రహ్మం బదిలీపై వస్తున్నారు. చేవెళ్లలో పనిచేస్తున్న ఎస్‌ఐ హయ్యూమ్ సనత్‌నగర్‌కు, మహేందర్‌రెడ్డి గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లకు బదిలీ చేశారు.

శంకర్‌పల్లిలో..

మండలంలోని మోకిల పోలీస్‌స్టేషన్‌కు హమ్మద్ పాషా మియాపూర్ పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వస్తున్నారు. శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న వి.సుందరయ్య కొల్లూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

అమ్మా బైలెల్లినాదో..



షాబాద్ : మద్దూరు గ్రామంలో బోనాల ఊరేగింపు

షాబాద్: షాబాద్ మండలంలోని తాళ్లపల్లి, మద్దూరు, బోడంపహాడ్, రేగడిదోస్వాడ, సర్దార్‌నగర్, కుర్వగూడ గ్రామాల్లో బోనాలు ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. గురువారం ఉదయం నుంచి భక్తులు గ్రామ దేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా తరలివచ్చి గ్రామ దేవతలకు నైవేద్యాన్ని సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని మొక్కులు అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులున్నారు.

షాద్‌నగర్‌లో..

షాద్‌నగర్ రూరల్: ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం షాద్‌నగర్ పట్టణం, మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంతో పాటుగా వివిధ గ్రామాలలో పోచమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్ల, పోతు రాజుల విన్యాసాలు, శివసత్తుల ఆటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. చల్లంగా చూడాలని గ్రామ దేవతను వేడుకున్నారు.

బోనాల సంబరాలు

మొయినాబాద్ రూరల్: ఆషాఢమాసంలో బోనాల ఉత్సవాలు గురువారం మొయినాబాద్ మండలంలోని అమ్డాపూర్, బాకారం, కాశీంబౌలి, నదీమ్‌నగర్, నక్కలపల్లి ఆయా గ్రామాల్లో వైభవంగా బోనాలను నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో మహిళలు మైసమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

ఘనంగా పోచమ్మ బోనాల జాతర

కొత్తూరు: కొత్తూరు పట్టణంలో గురువారం పోచమ్మ బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆట, పాటలతో తొట్టెలను ఊరేగించారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మహిళలు, నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ మండలంలో..

మొయినాబాద్: ఆషాడ బోనాల ఉత్సవాలు గ్రామాల్లో ఘనంగా జరిగాయి. గురువారం మండల పరిధిలోని పెద్దమంగళారం, అమీర్‌గూడ, సురంగల్, శ్రీరాంనగర్, మేడిపల్లి తదితర గ్రామాల్లో మైసమ్మ బోనాల ఊరేగింపు అంగరంగ వైభవంగా చేపట్టారు. డప్పుల చప్పుళ్ల, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో బోనాల ఊరేగింపు కొనసాగింది. మహిళలు బోనాలను అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. యువకులు తొట్టెల ఊరేగింపును ఉత్సాహంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



బోనాలతో మహిళలు



బాకారంలో పోతరాజుల విన్యాసాలు



మొయినాబాద్ మండలం సురంగల్‌లో బోనాల ఊరేగింపు